క్లుప్తంగా...

మహిళా మోర్చా బతుకమ్మ వేడుకలు రేపు

రామంతాపూర్: రామంతాపూర్ చిన్న చెరువు గంగమ్మ ఆలయం వద్ద ఈ నెల 21న శనివారం సాయంత్రం 4.30 గంటలకు బతుకమ్మ సంబరాలు జరుపుతున్నట్లు బీజేపీ మహిళా నాయకులు తెలిపారు. గురువారం నెహ్రూనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది తరహాలో ఈ ఏడాది సైతం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న బతుకమ్మ సంబురాల్లో మహిళలు భారీగా పాల్గొనాలని, విజేతలకు బహుమతులు అందించనున్నట్లు వారు పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ మహిళా నాయకులు జాజుల గౌరి, ప్రేమలత, వీణ, పారిజాత, భాగ్య, కీర్తి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ నుంచి కర్నూల్‌కు స్పెషల్ ట్రైన్

మల్కాజిగిరి: విశాఖపట్నం నుంచి మల్కాజిగిరి మీదుగా వీక్లీ స్పెషల్ ట్రైన్ కర్నూల్ వరకు పొడిగించారని సబర్బన్ ట్రైన్ అండ్ బస్ ట్రావెలర్స్ అసోసియేషన్ కార్యదర్శి, డీఆర్‌సీసీ సభ్యుడు నూర్ తెలిపారు. విశాఖపట్నం నుంచి ట్రైన్(08585) మంగళవారం సాయంత్రం 5.35 గంటలకు బయలుదేరి మల్కాజిగిరికి బుధవారం ఉదయం 7.23 గంటలకు, కర్నూల్‌కు మధ్యాహ్నం 1.25 గంటలకు చేరుకుంటుందన్నారు. అదేరోజు కర్నూల్ నుంచి ట్రైన్(08586) మధ్యాహ్నం 3.30కు బయలుదేరి మల్కాజిగిరికి రాత్రి 8.30 గంటలకు, గురువారం ఉదయం 9.50 గంటలకు విశాఖపట్నం చేరుతుందన్నారు. ఈ నెల 24వ తేదీ నుంచి ట్రైన్ ప్రారంభం అవుతుందని, ఈ సౌకర్యాన్ని కల్పించిన వాల్తేర్ డివిజనల్ మేనేజర్‌కు ప్రయాణికుల సంఘం తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

సన్మానం



గౌతంనగర్: బీఆర్‌ఎస్ మల్కాజిగిరి అభ్యర్థిగా బీఫాం అందుకున్న మర్రి రాజశేఖర్‌రెడ్డిని గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని కోరారు.

పండగ వంటల్లో పోషకాలు ఉండాలి

సాక్షి, సిటీబ్యూరో: రానున్న పండగల సీజన్‌లో పిండి వంటల్లో పోషకాలు ఉండేలా జాగ్రత్త పడాలని ప్రముఖ పోషకాహార నిపుణులు సూచించారు. కాలిఫోర్నియా ఆల్మండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో వీరు మాట్లాడుతూ సంప్రదాయ వంటకాల్లో బాదం పప్పులు వంటివి మేళవించడం ద్వారా పలు రకాల అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండొచ్చునని సూచించారు.

శేఖర్‌బాబుకు అవార్డు



మల్లాపూర్: మల్లాపూర్ అన్నపూర్ణ కాలనీకి చెందిన సామాజికవేత్త, కాలనీ ప్రధాన కార్యదర్శి కటార్ల శేఖర్‌బాబుకు స్ఫూర్తి డాక్టర్ అబ్దుల్ కలాం నేషనల్ అవార్డు లభించింది, స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్‌జీవో ఫౌండర్ చైర్మన్ ఆకుల రమేష్ చేతులమీదుగా కటార్ల శేఖర్ బాబు అవార్డు అందుకున్నారు.

వైద్య శిబిరానికి స్పందన



అల్వాల్: బీఆర్‌ఎస్ మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని గోకుల్‌నగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా 200 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

సాంస్కృతిక వైభవం



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో దసరా, బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వాణి రమణ శిష్యబృందం చే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఔరా అనిపించింది. పూర్వం రంగం, రంగ పూజ, వినాయక కౌతం, బ్రహ్మాంజలి తదితర అంశాలపై చేసిన నృత్య ప్రదర్శన అలరించింది.

మేడ్చల్ నియోజకవర్గం రాజకీయంలో నేతలు రంగులు మారుస్తుండటంతో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి అధికార బీఆర్‌ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీకి భారీ షాక్ తగిలింది. కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర జంగయ్య(వజ్రేష్) యాదవ్‌కు అసమ్మతి నేతలు మద్దతు ఇస్తున్నా కీలక అసమ్మతి నాయకుడు హరివర్ధన్‌రెడ్డి రూపంలో ఇంకా అనిశ్చితి కనిపిస్తోంది. – మేడ్చల్



కాంగ్రెస్‌లో చేరుతున్న సుధీర్‌రెడ్డి(ఫైల్)

బీఆర్‌ఎస్‌కు లాస్.. కాంగ్రెస్‌కు బూస్ట్

రంగులు మారుతున్న రాజకీయంతో మారుతున్న సమీకరణాలు

సుధీర్‌రెడ్డి లాస్ ఎంతగా చూపుతుందో..?

మంత్రి మల్లారెడ్డికి కొరకరాని కొయ్యగా..

మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మేడ్చల్ నియోజకవర్గంలో సీనియర్ రాజకీయవేత్త, వార్డు సభ్యుడిగా ప్రస్థానం ప్రారంభించి గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, హైదరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నో పదవులు చేపట్టిన ఆయన ఎమ్మెల్యే వరకు ఎదిగారు. ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే. సుదీర్ఘ అనుభవం ఉన్న సుధీర్‌రెడ్డి ఐదేళ్లుగా అసమ్మతితో ఉన్నా కుమారుడు శరత్‌చంద్రారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్‌గా బీఆర్‌ఎస్ నుంచి ఉండటంతో స్వపక్షంలో విపక్ష నాయకుడిగా ఉంటూ మంత్రి మల్లారెడ్డికి కొరకరాని కొయ్యగా మారాడు. నియోజకవర్గమంతా పట్టున్న నాయకుడు, సీనియర్ నాయకుడు, పోల్ మేనేజ్‌మెంట్ తెలిసిన నాయకుడు, నాలుగు లక్షలకు పైగా ఓటర్లు ఉన్న ఉమ్మడి ఘట్‌కేసర్ మండలం, బోడుప్పల్, పీర్జాదిగూడలో పూర్తిగా పట్టుఉండటం, అనుచరులు ఎక్కువగా అక్కడే ఉండటంతో ఆయనకు ప్లస్ పాయింట్‌గా ఉంది. బీఆర్‌ఎస్‌కు ఇదే మైనస్ పాయింట్‌గా మారింది. కాంగ్రెస్ అభ్యర్థి బోడుప్పల్ కావడం, ఘట్‌కేసర్‌కు చెందిన సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి కాంగ్రెస్‌లో చేరడం కాంగ్రెస్‌కు కలిసివచ్చే బలం. ఉమ్మడి ఘట్‌కేసర్ బీఆర్‌ఎస్‌లో మంత్రి మల్లారెడ్డి తర్వాత రాజకీయం చేస్తున్న ప్రధాన నాయకులు సుధీర్‌రెడ్డి అనుచరులే కావడంతో వారి ప్రభావం ఎంత, వారు ఎక్కడ ఉంటారు వంటి విషయాలపై బీఆర్‌ఎస్ అధిష్టానం ఆరా తీస్తోంది. మొత్తం మీద సుధీర్‌రెడ్డి, ఆయన కుమారుడు శరత్‌చంద్రారెడ్డి కాంగ్రెస్‌లో చేరడం బీఆర్‌ఎస్‌కు మైనస్.. కాగా కాంగ్రెస్‌కు ప్లస్‌గా మారింది.



ఫైల్

ఫలించిన రేవంత్ వ్యూహం..

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి సుధీర్‌రెడ్డికి దగ్గర బంధుత్వం ఉంటడంతో ఆయన వరుసకు తన అన్న అయిన సుధీర్‌రెడ్డిని చాలా రోజుల నుంచి పార్టీ మార్చేందుకు ప్రయత్నాలు సాగించాడు. రేవంత్‌కు రాజకీయంగా శత్రువుగా ఉన్న మంత్రి మల్లారెడ్డితో సుధీర్‌రెడ్డికి కూడా శత్రువుగా మారడంతో ఇద్దరి శత్రువైన మల్లారెడ్డిని రాజకీయంగా దెబ్బకొట్టాలని రేవంత్‌రెడ్డి పావులు కదిపి సుధీర్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి చేర్చుకోవడంలో సఫలీకృతులయ్యారు.

బలం, బలగంతో..

సుధీర్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి మారడంతో కాంగ్రెస్‌కు బలం సమకూర్చగా బీఆర్‌ఎస్‌కు నష్టం చేకురుస్తుంది. కాంగ్రెస్ అభ్యర్థి జంగయ్యయాదవ్‌కు మద్దతుగా నియోజకవర్గ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, నియోజకవర్గ ఓటర్లపై ప్రభావం చూపే సత్తా ఉన్న మైనంపల్లి హన్మంత్‌రావు, నిలవడం, అసమ్మతితో ఉన్న హరివర్ధన్‌రెడ్డితో మంతనాలు జరపడంతో నాయకులపరంగా చూస్తే కాంగ్రెస్ బలం పెరిగినట్లు కనిపిస్తుండగా మంత్రి మల్లారెడ్డి తన బలం, బలగంతో దూసుకుపోతున్నారు.

పదవి పోతుందని తెలిసినా..

పార్టీ మారితే శరత్‌చంద్రారెడ్డి పదవి పోతుందని తెలిసినా కుమారుడిని తీసుకుని కాంగ్రెస్‌లో చేరడం చర్చగానే ఉంది. మేడ్చల్ జెడ్పీలో ఐదుగురు జెడ్పీటీసీలు ఉండగా ఒకరు కాంగ్రెస్, నలుగురు బీఆర్‌ఎస్ సభ్యులుగా ఉన్నారు. శరత్‌చంద్రారెడ్డి కాంగ్రెస్ వైపు వెళ్లడంతో కాంగ్రెస్ బలం ఇద్దరికి మారినా చెయ్యి కోసం కావాల్సిన బలం బీఆర్‌ఎస్‌కే ఉంది. పదవి కాలం ఆరు నెలల్లో ముగియనుంది. ఎన్నికలు ముగిశాక అవిశ్వాసం పెట్టి కుమారుడి పదవికి ఎసరు పెడతారని తెలిసినా పార్టీ మారడంలో కుర్చీ మీద ప్రేమ కన్నా మల్లారెడ్డిని ఓడించాలనే కసితో మాజీ ఎమ్మెల్యే వర్గంలో కనిపిస్తుంది.

పొలం బాట టూర్‌లో విద్యార్థులు



పొలం బాట టూర్‌లో విద్యార్థులు

బోడుప్పల్: బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పొలం బాట ఎడ్యుకేషన్ టూర్‌లో భాగంగా పొలాలను సందర్శించి అక్కడ పచ్చదనాన్ని ఆస్వాదించారు. పొలాల విశిష్టత, రైతు కష్టం, పొలాన్ని పంట కోసం సిద్ధపరిచే విధానం, విత్తనాల కొనుగోలు, నీళ్ల అందించడం, విత్తనాలు మొలకెత్తి ఎదిగే కొద్దీ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంట చేతికి వచ్చిన తర్వాత పంట కోత గురించి, విత్తనాల సపరేషన్, గోడౌన్‌ల విధానాల గురించి విద్యార్థులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ దేశానికి వెన్నెముక అయిన రైతు శ్రమ, వ్యవసాయం, వ్యవసాయ ఉత్పత్తులు తెలిపేందుకు ఈ టూర్ నిర్వహించినట్లు తెలిపారు. పచ్చని వరి పొలాలు మధ్య తిరగడం ఎంతో ఆనందం, ఆహ్లాదం ఇచ్చినట్లు విద్యార్థులు వెల్లడించారు. ఈ టూర్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రగతి చక్ర అవార్డుల ప్రదానోత్సవం

బోడుప్పల్: టార్గెట్ మించి ఎక్కువ ఆదాయం తీసుకొచ్చిన కండక్టర్లు, ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లు, విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మెయింటెనెన్స్ సిబ్బంది, సూపర్‌వైజర్లకు గురువారం చెంగిచర్ల డిపోలో ప్రగతి చక్ర అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కవిత మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో అంకితభావంతో పని చేయడంతో పాటు సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆర్టీసీలో ప్రవేశపెట్టిన గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్ 100 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. 30 మంది డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్ సిబ్బందికి ఈ అవార్డ్స్ అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు ఆనందరావు, సాయి సుబ్రహ్మణ్యం, అశోక్‌కుమార్, శ్రీనివాస్, మహాదేవి పాల్గొన్నారు.



అవార్డులతో ఆర్టీసీ ఉద్యోగులు

డబ్బులు చల్లి నాయకులను కొంటున్నారు..

ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



మైనంపల్లి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బాల్‌రాజ్ యాదవ్ దంపతులు

గౌతంనగర్: కోట్ల రూపాయలు పెట్టి నాయకులు, కార్యకర్తలను అధికార పార్టీ వారు కొనుగోలు చేస్తున్నారని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. గురువారం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానెహ్రూనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన బాల్‌రాజ్ యాదవ్, సుమలతయాదవ్‌తో పాటు సుమారు 300 మంది ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ గౌతంనగర్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను ప్రణాళిక బద్ధంగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించండి



మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ మల్కాజిగిరి అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ బీజేఆర్‌నగర్, పీవీఎస్ కాలనీ, వసంతపురికాలనీ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ పనిచేస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలన్నారు. పార్టీ మ్యానిఫెస్టోలో ఉన్న పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మురుగేష్, మాజీ కార్పొరేటర్ ఆకుల నర్సింగరావు, జేఏసీ వెంకన్న, ఉపేందర్, ఖలీల్, వీరేశంయాదవ్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం

ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పనిచేస్తుందని ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం కాప్రాలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల బీఆర్‌ఎస్‌లో చేరిన రాగిడి లక్ష్మారెడ్డి ఉప్పల్ నియోజకవర్గంలో సుపరిచితుడని, తన ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని, ఆయన బీఆర్‌ఎస్‌లో చేరడం సంతోషకరమన్నారు. అనంతరం రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. 20 సంవత్సరాలుగా కాంగ్రెస్‌లో ఎన్నో కార్యక్రమాలు చేశానని, కానీ పార్టీ తనను విస్మరించిందన్నారు. మేడ్చల్‌లో నిర్వహించిన బహిరంగసభలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తాను బీఆర్‌ఎస్‌లో చేరానని, ఉప్పల్ నియోజకవర్గ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లలో అన్ని వసతులు కల్పించాలి

ఉప్పల్: ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పకుండా పాటించాలని ఉప్పల్ నియోజకవర్గ ఎన్నికల అధికారి అభిషేక్ అగస్త్య సూచించారు. రిటర్నింగ్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మల్కాజిగిరి ఏసీపీ ఆకుల శ్రీనివాస్, ఉప్పల్ సీఐ శ్రవణ్‌కుమార్, ఈఆర్‌వోలు, ఏఆర్‌వోలు, వెంకట నర్సింహారెడ్డి, డీసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లలో అన్ని వసతులను ఏర్పాటు చేయాలని సూచించారు. నిబంధనలను ఎవరు అతిక్రమించవద్దని సూచించారు. అనంతరం పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు.



మాట్లాడుతున్న అభిషేక్ అగస్త్య

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి



మౌలాలి: అన్నివర్గాల సంక్షేమానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. వినాయక్‌నగర్ డివిజన్ శ్రీసాయినగర్ కమ్యూనిటీ హాలులో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన కురుమ సంఘం సభ్యులను మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురుమ సంఘం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు యాదగిరి, పిడుగు వెంకటేష్, రవి, శ్రీశైలం, మోమిన్ భాష, సత్తయ్య, మల్లేష్, ఉపేందర్, ఆంజనేయులు, రహీమ్, సత్యనారాయణ, నాయకులు పిట్ల శ్రీనివాస్, వెంకటేష్‌యాదవ్, సతీష్ కుమార్, నాగరాజు, సంతోష్ రాందాస్, లక్ష్మీనారాయణరెడ్డి, సందీప్‌గౌడ్ పాల్గొన్నారు.

రూ.4.63 లక్షల పట్టివేత

కుషాయిగూడ: ఎన్నికల నేపథ్యంలో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో గురువారం రూ.4.63 లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. కమలానగర్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో భాగంగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఎండీ ఇబ్రహీం అనే వ్యక్తి వద్ద రూ.4 లక్షలు గుర్తించారు. ఏఎస్‌రావునగర్‌లో చేపట్టిన వాహన తనిఖీల్లో ఆటోలో వెళ్తున్న ఎస్.నగేష్ వద్ద రూ.63 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..



బతుకమ్మ వేడుకలు మైనంపల్లి వాణి

అల్వాల్: భమరాంబ మల్లికార్జున మహిళా మండలి టెంపుల్ అల్వాల్ చెరువు కట్ట వద్ద బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సతీమణి వాణి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ కమిటీ, ఆర్యవైశ్య సంఘం అల్వాల్ ఆధ్వర్యంలో మురళీకృష్ణ అసోసియేషన్ పార్కులో బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి.

ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో..

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు జరిగాయి. వేడుకల్లో ఎమ్మెల్యే సతీమణి మైనంపల్లి వాణి పాల్గొన్నారు.



అరోరాలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

రామంతాపూర్: గణేష్‌నగర్‌లోని అరోరా పీజీ కళాశాలలో గురువారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అందమైన బతుకమ్మలు తయారు చేసిన విద్యార్థినులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.మాధవి బహుమతులు అందజేశారు. కళాశాల ఎంబీఏ, ఎంసీఏ డాక్టర్ సీహెచ్ సతీష్‌కుమార్, దేవేంద్ర రావు పాల్గొన్నారు.



అరోరా పీజీ కళాశాలలో



అల్వాల్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్‌ఎస్

ఉప్పల్: చిలుకానగర్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి రాగిడి లక్ష్మారెడ్డి పర్యటించారు. డివిజన్ పరిధిలోని మర్రిచెట్టు, న్యూరాంనగర్, ఆదర్శనగర్, ఎస్సీ కమ్యూనిటీ హాల్ తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొల్లం లక్ష్మణ్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు.

హెచ్‌బీకాలనీలో ఇంటింటి ప్రచారం..

కుషాయిగూడ: బీఆర్‌ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి మద్దతుగా మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం హెచ్‌బీకాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

అంతా ఒక్కటయ్యారు..

కుషాయిగూడ: నిన్నటి వరకు ఎడమొహం.. పెడమొహంగా ఉన్న చర్లపల్లి డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులంతా ఒక్కటయ్యారు. కార్పొరేటర్, బీఎల్‌ఆర్, ఎమ్మెల్యే వర్గాలుగా విడిపోయినవారంతా సమష్టిగా కృషి చేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని గెలుపు బాటలో నిలపాలని నిర్ణయించుకున్నారు. అంతా కలిసి పనిచేద్దామంటూ స్వీట్లు తినిపించుకొని ఐక్యత చాటారు. కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు దప్పు గిరిబాబు, నాగిళ్ల బాల్‌రెడ్డి, విద్యాసాగర్, కనక రాజుగౌడ్, నారెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ప్రభుగౌడ్, మహేష్ గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా బీఆర్‌ఎస్ శ్రేణుల ప్రచారం

మల్లాపూర్: డివిజన్‌లో ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి మద్దతుగా బీఆర్‌ఎస్ శ్రేణులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. ఇస్త్రీ చేసి ఓటు అభ్యర్థించారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి వాసుగౌడ్, కటార్ల భాస్కర్, బోదాసు లక్ష్మీనారాయణ, దయాకర్‌రెడ్డి, కుంటి కృష్ణ, రాపోలు సతీష్, శ్రీకాంత్, నెమలి శ్రావణ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే ఉప్పల్ అభివృద్ధి..

మల్లాపూర్: బీఆర్‌ఎస్‌తోనే ఉప్పల్ అభివృద్ధి జరుగుతుందని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ అన్నారు. నాచారం స్నేహపురి, వీఎస్‌టీ కాలనీ, భవానీ నగర్ కాలనీలో ప్రచారం చేశారు. వీఎస్టీ కాలనీకి చెందిన పలువురు మహిళలు పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేత నెమిలి కొండ భూపాల్‌రెడ్డి, కోరపాక అంజి, విఠల్ యాదవ్, చంద్రశేఖర్, బుచ్చన్నగౌడ్, సువర్ణ పాల్గొన్నారు.



స్వీట్లు తినిపించుకున్న బీఆర్‌ఎస్ చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి తదితరులు



చిలుకానగర్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి, బన్నాల ప్రవీణ్



హెచ్‌బీకాలనీలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి



మల్లాపూర్‌లో ఇస్త్రీ చేస్తూ ఓటు అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి